క్లుప్తంగా

గుర్రపుడెక్క తొలగింపు



పిట్టలవానిపాలెం: మండల పరిధిలోని ఆరెమండ్ల పంట కాలువ పరిధిలోని చివరి భూములకు సాగు నీటిని అందించేందుకు చర్యలు చేపట్టామని నీటిపారుదల శాఖ ఏఈ గుమ్మడి శిరీష తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని ఆరెమండ్ల పంట కాలువలో తూటికాడ, గుర్రపుడెక్క తొలగింపు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కాలువలో పేరుకు పోయిన తూటికాడ, గుర్రపు డెక్క తొలగించి, సమస్యను కొంత వరకు తగ్గించడం జరిగిందన్నారు. ఆమె వెంట బాపట్ల ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి, రైతులు ఉన్నారు.

చందోలులో ఘనంగా హరిద్ర శృంగార్చన



పిట్టలవానిపాలెం: చందోలు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ బగళాముఖి అమ్మవారి దేవాలయంలో మంగళవారం హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈఓ జి.నరసింహమూర్తి మాట్లాడుతూ.. ఆలయంలో ప్రతి మంగళవారం వివాహం కాని ఆడపిల్లలకు శీఘ్రంగా వివాహం జరుగుటకు ప్రత్యేకంగా పసుపు కొమ్ములతో హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, పరిసర గ్రామాల నుంచి భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని, భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

ఆంగ్ల భాష బోధనపై జాతీయస్థాయి సదస్సు

పిట్టలవానిపాలెం: ఖాజీపాలెం డిగ్రీ కళాశాలలో గురువారం ఆంగ్ల భాష బోధన విధానంపై జాతీయ స్థాయి సదస్సు ఆన్‌లైన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.శివప్రసాద్ వివరాలు వెల్లడించారు. విద్యార్థులకు ఇలాంటి సదస్సులు నిర్వహించడం వల్ల కమ్యూనికేషన్ స్కిల్స్ అలవడుతాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి రిసోర్సు పర్సన్‌లుగా హైదరాబాద్ నుంచి డాక్టర్ జి.సువర్ణలక్ష్మి, విశాఖపట్నం నుంచి డాక్టర్ యూఎస్ సాల్మన్ బెన్ని, మధ్యప్రదేశ్ నుంచి డాక్టర్ ఎం.డి. రెహమాన్, సిక్కిం నుంచి డాక్టర్ ఎస్.చాంబ్లింగ్ పాల్గొన్నారని తెలిపారు. ఆంగ్ల బాష బోధన విధానంలో సరైన పద్ధతులు పాటించి, బోధిస్తే..విద్యార్థులకు సక్రమంగా అర్థమవుతుందని తెలిపారు. దీంతో వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కమిటీ అధ్యక్షుడు ఎం.నరసరాజు, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ శ్రీనివాసకుమార్, జాయింట్ సెక్రటరీ ఎం.కృష్ణంరాజు, ప్రిన్సిపల్ డాక్టర్ టి.శివప్రసాద్, ఆంగ్ల విభాగాధిపతి కిషోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో నైపుణ్యం సాధించాలి



రేపల్లె: విద్యార్థి దశ నుంచే క్రీడల్లో నైపుణ్యం సాధించే విధంగా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు చైతన్యపరచాల్సిన అవసరం ఎంతైనా ఉందని రామకృష్ణ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ డాక్టర్ కుర్రా మహేష్ అన్నారు. ధ్యాన్‌చంద్ జన్మదినాన్ని పురస్కరించుకుని క్రీడాదినోత్సవాన్ని స్థానిక స్కూల్‌లో మంగళవారం నిర్వహించారు. డాక్టర్ మహేష్ మాట్లాడుతూ క్రీడల్లో రాణిస్తే ఆ కీర్తిప్రతిష్ఠలు తమతో పాటు దేశానికి ఇనుమడింపజేయవచ్చన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఇచ్చిన పలు క్రీడా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ కుర్రా అపర్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా నగదు అందజేత

బాపట్ల అర్బన్: తూర్పు బాపట్ల గ్రామ పంచాయతీ పరిధిలోని నందిరాజుతోట నివాసి వాకా నారాయణ (39) ఈ నెల 24న సహజ మరణం చెందాడు. వైఎస్సార్ బీమా కింద మట్టి ఖర్చుల నిమిత్తం రూ. 10వేల నగదును మృతుని కుటుంబానికి మంగళవారం పంచాయతీ కార్యదర్శి పల్నాటి శ్రీరాములు అందజేశారు. గ్రామ పెద్దలు పీటా వేణుగోపాల్, మోర్ల సముద్రాలు గౌడ్ , కె.మోహన్ రాజు, ఏమినేని శ్రీనివాస రావు, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ ప్రవీణ రాణి, మహిళా పోలీస్ మేడూరి సుప్రియ, వలంటీర్ బాల చంద్ర గౌడ్ పాల్గొన్నారు.

ప్రజాకాంక్ష..మరోసారి సీఎంగా వైఎస్ జగన్

రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు



మహిళలతో మాట్లాడుతున్న ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు

నిజాంపట్నం: అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, ఆర్థికాభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్న వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని మరో మారు ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. మండలంలోని కళ్లిఫలం పంచాయతీ పరిధిలోని కోణఫలంలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. పక్షపాతం, రాగద్వేషాలకు తావులేకుండా అర్హులైన ప్రతి ఒక్కరి ఇంటి గడప వద్దకే సంక్షేమ ఫలాలు అందిస్తున్న సీఎం వైఎస్ జగన్ పాలన చరిత్రలో నిలిచిపోతుందన్నారు. సంక్షేమంతో పాటు అభివృద్ధికి పెద్దపీట వేస్తూ ముందుకు సాగుతున్న జగనన్నపై ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా ప్రజలు విశ్వసించేది ఆయన పాలననేనని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ మోపిదేవి విజయనిర్మల, జెడ్పీటీసీ నర్రా సుబ్బయ్య, సర్పంచ్ బెల్లంకొండ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల అభివృద్ధికి రూ.3.98 కోట్ల నిధులు

- కొల్లూరు మండల సర్వసభ్య సమావేశం
- సమస్యల పరిష్కారంలో అధికారుల పాత్రపై అసంతృప్తి



సమావేశంలో మాట్లాడుతున్న వేమూరు మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ శిరీష

కొల్లూరు: మండల ప్రజా పరిషత్తు సర్వసభ్య సమావేశం నామమాత్రంగా మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో రహదారుల అభివృద్ధికి నిధులు కేటాయింపులు జరిపినట్లు వేమూరు మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ ఉప్పు శిరీష, ఆర్అండ్‌బీ ఏఈ ఎం. నరసింహారావు తెలిపారు. వేమూరు మార్కెట్ యార్డు నుంచి వ్యవసాయ ఉత్పత్తులు తరలింపునకు అవసరమైన లింకు రోడ్ల అభివృద్ధికి రూ. 1.98 కోట్లు మండలంలోని పలు గ్రామాలకు కేటాయించినట్లు చైర్‌పర్సన్ ప్రకటించారు. గాజుల్లంక, భట్టిప్రోలు మండలంలోని చింతమోటు వరకు 9.6 కిలో మీటర్ల మేర రహదారి మరమ్మతుల కోసం రూ. 2 కోట్లు నిధులు మంజూరవ్వగా, పెసర్లంక అడ్డరోడ్డు నుంచి అరవింద వారధి వరకు రోడ్డు మరమ్మతుల కోసం రూ.40 లక్షలకు అనుమతులు రావాల్సి ఉందని ఆర్అండ్‌బీ ఏఈ తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పలు సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. బాపట్ల, కృష్ణా, గుంటూరు జిల్లాల గ్రామాలతో మిళితమై ఉన్న లంక గ్రామాలకు వెళ్లే మార్గం అధ్వానంగా తయారవడంతో పాటు, భారీ వాహనాల రాకపోకల కారణంగా ప్రజలు ప్రమాదాల బారిన పడి, ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని తెలిపారు. ఈ సమస్యను ఎన్ని సమావేశాల్లో ప్రస్తావించినా ఫలితం లేకుండా పోతోందని, గాజుల్లంక ఎంపీటీసీ సభ్యుడు బావిరెడ్డి వెంకట్రామయ్య ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు సమావేశానికి హాజరవ్వకుండా దాటవేత దోరణితో వ్యవహరిస్తుంటే తాము సమావేశంలో ఉండటం అనవసరమని ఆగ్రహం వ్యక్తం చేశారు. లాక్ సెంటర్ ప్రాంతంలో వంతెనలు బలహీనంగా మారాయన్నారు. అధికారులు తాము చెప్పిందల్లా వినడమే మినహా ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని, దానికి నిరసనగా తాను సమావేశాన్ని బాయ్‌కాట్ చేస్తున్నానని ప్రకటించి, బయటకు వెళ్లిపోయారు. పోతార్లంక రోడ్డు పరిస్థితిపై తోకలవారిపాలెం సర్పంచి కృష్ణమోహన్ అధికారులను ప్రశ్నించడంతో, జిల్లా పరిషత్తు దృష్టికి సమస్యను తీసుకువెళ్లి రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తానని ఎంపీడీఓ ఐ.సత్యనారాయణ రావు తెలిపారు. తహసీల్దారు ఎ.శ్రీనివాసరావు మాట్లాడుతూ లంక గ్రామాల్లో సొసైటీ భూములకు పట్టాలు మంజూరు విషయం రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున కృషితో చివరి దశకు చేరుకుందని వెల్లడించారు. గాజుల్లంక ప్రాంత రైతులు తమకు సహకరించి, వారి వద్ద ఉన్న భూముల తాలూకు డాక్యుమెంట్‌లు అందజేస్తే హెచ్‌ఓ భూములకు కూడా పట్టాలు ఇచ్చేందుకు కృషిచేస్తామని తెలిపారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు బొప్పర సుబ్బారావు, వైస్ ఎంపీపీ మురాల రాంబాబు పాల్గొన్నారు.

'గడప గడపకు' నిధులతో అభివృద్ధి పనులు

చినపరిమి(వేమూరు): గ్రామ సచివాలయాలకు కేటాయించిన నిధులతో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు గ్రామ సర్పంచ్ మేరుగ సుభాషిణి తెలిపారు. చుండూరు మండలంలోని చినపరిమి గ్రామంలో సిమెంట్ రోడ్డు రూ.5 లక్షలు, విద్యుత్ స్తంభాలు రూ.5 లక్షలు, సైడ్ డ్రైయినేజీ రూ.10 లక్షలు సచివాలయం నిధులతో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయం కన్వీనర్ తుమ్మా బసివిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పాముల రెడ్డి, రాజేష్ కుమార్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు.

పోర్టబుల్ సోలార్ లైట్స్ అందజేత

రేపల్లె రూరల్: చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బొబ్బర్లంక, రావి అనంతవరం, పెనుమూడి, చోడాయపాలెం, పిరాట్లంక, పోటుమెరక, కారుమూరు గ్రామాలలో విద్యుత్ లేని పేదల గృహాలకు పోర్టబుల్ సోలార్ లైట్స్‌ను ఆయా గ్రామాల సర్పంచ్‌లు మంగళవారం పంపిణీ చేశారు. పేదలకు ఫౌండేషన్ అందిస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ క్రాప్ ప్రోగ్రాం మేనేజర్ శ్రీనివాసరావు, సర్పంచ్‌లు దారం విజయ్ కుమార్, మాతంగి రవి, శివమల్లేశ్వరరావు, సభ్యులు సీహెచ్ రత్న, ఏంజెల్, ఆశ, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం విక్రేత అరెస్ట్

రేపల్లె రూరల్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. సెబ్ సీఐ లీనా వివరాల మేరకు.. తమకు అందిన సమాచారంతో నల్లూరుపాలెం గ్రామంలో దాడులు నిర్వహించామన్నారు. గ్రామానికి చెందిన గొరికపూడి యానయ్య అక్రమంగా మద్యం విక్రయిస్తు పట్టుబడినట్లు తెలిపారు. అతని నుంచి 13 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, నిందితుడిని కోర్టులో హాజరుపరిచినట్లు చెప్పారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



కొల్లిపర: బాల్య వివాహాలు నిర్వహించడం చట్ట పరంగా నేరం అని ఎంపీపీ భీమవరపు పద్మావతి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బాల్య వివాహాలపై మండల స్థాయిలో అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బాల్య వివాహాలపై పలు అంశాల గురించి అవగాహన కల్పించడానికి జిల్లా బాలల పరిరక్షణ విభాగం నుంచి టి.దుర్గాభవాని, సిడిడిసి ప్రాజెక్టు తెనాలి చైల్డ్ డిపార్టిమెంట్ అధికారి ఎం.సునిట్, న్యాయ పరివేక్షణాధికారి వి.వాసంతి, పాల్గొన్ని మాట్లాడుతూ ప్రతి ఒక్కరు బాల్య వివాహ నిషేదిత చట్టం 2006 గురించి పూర్తిగా తెలుసుకుని దానిలోని పలు అంశాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. మండలంలో ఏ గ్రామంలోనైనా బాల్య వివాహాలు జరుగుతుంటే ప్రజలు, అధికారులు వెంటనే స్పందించి పోలీసులకు లేదా ఉన్నత అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎఫ్ సంస్థ కోఆర్డినేటర్ కె.సమర్ కుమార్, ఐసిడిఎస్ సూపర్ వైజర్స్, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్ఓలు, మహిళ సంరక్షణ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్స్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా అభ్యంతరాలపై పూర్తిస్థాయి విచారణ



సమావేశంలో మాట్లాడున్న ఆర్డీవో పార్థసారథి

రేపల్లె రూరల్: ఎన్నికల కమిషన్ ఆదేశానుసారం ఓటరు సర్వే డివిజన్ పరిధిలో పూర్తిచేయటం జరిగిందని ఆర్డీవో జగన్నాథం పార్థసారథి తెలిపారు. స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఆయన మాట్లాడారు. బీఎల్వోలు, ఇతర ఎన్నికల అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ల పూర్తి వివరాలు తెలుసుకున్నట్లు చెప్పారు. సర్వేలో మృతుల, డబుల్ ఎంట్రీలు, చేర్పులు, మార్పులపై అభ్యంతరాలు స్వీకరించి, నిర్ధారణ అనంతరం తొలగించామన్నారు. అభ్యంతరాలపై పూర్తిస్థాయి మరోమారు విచారించి, జాబితాను సరిచేస్తామన్నారు. సమావేశంలో తహసీల్దారు మల్లికార్జున రావు, ఏవో జాన్‌పీటర్ పాల్గొన్నారు.

అక్రమ రుణాలు పొందిన వారిపై చర్యలు తీసుకోవాలి



మెప్మా సీఎంఎంకు సమస్యను విన్నవిస్తున్న సీపీఎం, ఐద్వా నాయకులు

రేపల్లె: మహిళల సర్టిఫికెట్‌లతో అక్రమంగా బ్యాంకుల నుంచి రుణాలు పొందిన వారిపై చర్యలు తీసుకుని, డ్వాక్రా మహిళలకు న్యాయం చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్ అన్నారు. స్థానిక మెప్మా కార్యాలయంలో సీపీఎం, ఐద్వాల ఆధ్వర్యంలో సీఎంఎం సుజాతకు డ్వాక్రా మహిళలు మంగళవారం సమస్యను విన్నవించారు. డ్వాక్రాలో సభ్యులమైన తాము బ్యాంకు నుంచి ఎటువంటి రుణాలు పొందలేదని, ఇటీవల రుణాలు చెల్లించాలంటూ బ్యాంకుల నుంచి నోటీసులు పదేపదే వస్తుండటంతో విచారణలో తమ పేర్లతో కొంత మంది బ్యాంకర్లతో లాలూచీపడి రుణాలు పొందారని తెలిపారు. రుణాలు పొందిన వారిని, అక్రమ రుణాలు అందించిన బ్యాంకర్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఐద్వా రేపల్లె పట్టణ అధ్యక్షురాలు షేక్.జహీదా, కార్యదర్శి షేక్.ఆశ, డ్వాక్రా మహిళలు షబానా సుల్తానా, గౌసే, నాంచారమ్మ పాల్గొన్నారు.

'వేమూరు'లో 12,597ఓట్ల తొలగింపు



రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న ఎన్నికల అధికారి మోహనరావు

వేమూరు: వేమూరు నియోజక వర్గంలో ఓట్లు తొలగింపుపై విచారణ జరుగుతోందని నియోజకవర్గ ఎన్నికల అధికారి, ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ అధికారి మోహనరావు తెలిపారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో మంగళవారం వివిధ పార్టీ నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. వేమూరు నియోజకవర్గంలో 12,597 ఓట్లు తొలగించడం జరిగిందన్నారు. అందులో మృతులు 8,737, వివిధ ప్రాంతాల్లో నమోదైన ఓటర్లు 1,786, స్థాన చలనం ఓట్లు 2,067 ఉన్నాయని ఆయన తెలిపారు. ప్రతి మంగళవారం రాజకీయ నాయకులు, తహసీల్దారులతో సమావేశం ఏర్పాటు చేయడం జరుగుతుందని చెప్పారు. ఈ సమావేశాల్లో అభ్యంతరాలు తెలపవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో వేమూరు, అమర్తలూరు, చుండూరు, కొల్లూరు, భట్టిప్రోలు తహసీల్దార్లు నాగరాజు, మోహర్, కనకదుర్గ, శ్రీనివాసరావు, రాజకీయ నాయకులు బొల్లిముంత ఏడుకొండలు, గాదె శివరామ కృష్ణారెడ్డి, జ్యోతి బాబు, మైనేని మురళీ వివిధ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

1న రైల్వే గేటు సమస్యలపై సమావేశం



రైతులతో మాట్లాడుతున్న శివసాంబిరెడ్డి

తెనాలి: వేమూరు మండల పరిధిలోని చినరావూరు-జంపని రైలుగేటును తెరిపించాలని కోరుతూ సెప్టెంబరు ఒకటో తేదీ ఉదయం 10.30 గంటలకు జగ్గడిగుంటపాలెంలో జరిగే అఖిలపక్ష రైతు సదస్సును జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి కోరారు. మంగళవారం జగ్గడిగుంటపాలెం, యడవూరు, చినరావూరు గ్రామాల్లో రైతులతో సమావేశాలు జరిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.4 కోట్ల నబార్డు నిధులతో రోడ్డు వేసినా, రైల్వేశాఖ గేటు తెరవకపోవటంతో ఎనిమిది గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకుని రైల్వేశాఖతో మాట్లాడి రైతుల సమస్యను తీర్చాలని కోరారు. వీరితో ముద్దన సాంబశివరావు, తాటి వెంకటేశ్వర్లు, కుర్రా వెంకటరమణ, బొంతా సాంబశివరావు, బద్రి నారాయణ, దాది కోటేశ్వర రావు ఉన్నారు.

ఆర్బీకేలను సందర్శించిన వ్యవసాయాధికారులు



తెనాలిటౌన్: రూరల్ మండలం తేలప్రోలు గ్రామంలో రైతుభరోసా కేంద్రాన్ని జిల్లా వ్యవసాయాధికారి నున్న వెంకటేశ్వర్లు, వ్యవసాయాధికారులు సందర్శించారు. ఆర్బీకేలో ఉన్న ఎరువులను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం డీఏఓ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో ఆర్బీకె సిబ్బంది పంట ఈ-క్రాఫ్ నమోదును త్వరగా పూర్తి చేయాలని కోరారు. రైతులకు సరిపడా ఎరువులు ఆర్బీకెలో ఉన్నాయని ఉపయోగించుకోవాలని కోరారు. పీఎం కిసాన్ అర్హులు ఉన్న రైతులు ఆధార్‌కార్డు, ఫోన్ నెంబరు లింక్ చేయని వారు వీఆర్వోల ద్వారా లింక్ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తెనాలి ఏడీఏ ఎస్.ఉషారాణి, కొల్లిపర, తెనాలి, దుగ్గిరాల మండలాల వ్యవసాయాధికారులు వెంకట్రావు, ప్రేమ్‌సాగర్, శిరీష, తేలప్రోలు వీఏఏ హర్షిష్, రైతులు పాల్గొన్నారు.

సీఎం జగన్, మంత్రి నాగార్జున చిత్రపటాలకు క్షీరాభిషేకం



భట్టిప్రోలు: గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ సిబ్బంది జీతంపై 23 శాతం ఫిట్‌మెంట్ పెంచుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జీవో జారీ చేయడంతో మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. భట్టిప్రోలు మండల సమాఖ్య ఆవరణలో సీఎం వైఎస్ జగన్, మంత్రి నాగార్జున చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. ఏపీఎం గుడిమెట్ల శ్రీమన్నారాయణ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ దావూరి వెంకట లలితకుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు టి.ఉదయ భాస్కరి, వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్య శాస్త్రి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షులు కుందేటి రమేష్, సీసీలు దాసరి హనోకు, కొలకలూరి రజనికుమారి, కొండెపాటి సాంబయ్య, యానిమేటర్లు, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం సకాలంలో అందించాలి



అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచనలిస్తున్న సూపర్‌వైజర్ నగరాజకుమారి

కొల్లూరు : పౌష్టికాహారాన్ని గర్భిణులకు, బాలింతలకు సకాలంలో అందించేందుకు అంగన్‌వాడీ కార్యకర్తలు బాధ్యతగా వ్యవహరించాలని ఐసీడీఎస్ దోనేపూడి సెక్టార్ సూపర్‌వైజర్ నగరాజకుమారి అన్నారు. తిప్పలకట్ట అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం దోనేపూడి సెక్టార్ సమావేశం నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. సెక్టార్ పరిధిలో ఉన్న 57 మంది గర్భిణులకు, 58 మంది బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌లను అందించి, వారు ఆరోగ్యవంతంగా ఉండేలా పర్యవేక్షించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచాలని, చిన్నారులకు వారి ఎత్తు, బరువుకు అనుగుణంగా అవసరమైన పౌష్టికాహారాన్ని అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

'సార్వత్రిక విద్యా పీఠం' వాల్ పోస్టర్ల ఆవిష్కరణ



భట్టిప్రోలు: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యా పీఠం (దూర విద్యా విధానం) అడ్మిషన్లలో భాగంగా.. 'చదువు మళ్లీ కొనసాగిద్దాం-బంగారు భవితను నిర్మించుకుందాం' కార్యక్రమం వాల్ పోస్టర్లను ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి ఆవిష్కరించారు. భట్టిప్రోలు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంఈఓ ఎస్.దేవరాజు ఆధ్వర్యంలో మంగళవారం ఈ కార్యక్రమం జరిగింది. ఎంఈవో మాట్లాడుతూ.. 14 సంవత్సరాలు నిండిన, బడి మధ్యలో మానేసిన, ఉత్తీర్ణ సాధించని వారికి పదవ తరగతిలో చేరే అవకాశం ఉందన్నారు. 15 సంవత్సరాలు నిండి పదవ తరగతి ఉత్తీర్ణత సాధించిన, సాధించలేని వారు కూడా ఇంటర్మీడియట్‌లో చేరే అవకాశం ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్య శాస్త్రి పాల్గొన్నారు.

తెలుగు భాష గొప్పతనం తెలుసుకోవాలి



సదస్సులో మాట్లాడుతున్న ఆర్డీఓ గంధం రవీందర్



నృత్య ప్రదర్శన ఇస్తున్న చిన్నారులు

పిట్టలవానిపాలెం : తెలుగు భాష గొప్పతనాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని బాపట్ల ఆర్డీఓ గంధం రవీందర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో తెలుగు భాష సేవకులు గిడుగు వెంకటరామమూర్తి పంతులు జయంతి సందర్భంగా తెలుగు భాష దినోత్సవం సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. తెలుగు భాషాభివృద్ధికి గిడుగు ఎనలేని కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు డి.కవిత, ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

విశ్వశాంతి హైస్కూల్‌లో..

భట్టిప్రోలు: తెలుగు భాష దినోత్సవం సందర్భంగా భట్టిప్రోలు విశ్వశాంతి హైస్కూల్‌లో మంగళవారం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు భాష పితామహుడు గిడుగు రామమూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎం.పి.వెంకట్రావు, ప్రధానోపాధ్యాయులు ఫణి పార్థసారథి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాతృభాష గొప్పదనాన్ని తెలుసుకోవాలి

రేపల్లె రూరల్: ప్రతి ఒక్కరూ మాతృభాష గొప్పతనాన్ని తెలుసుకొని, ముందుకు సాగాలని భాష్యం స్కూల్ ప్రిన్సిపల్ కృష్ణారెడ్డి అన్నారు. తెలుగు భాష, క్రీడా దినోత్సవం సందర్భంగా పట్టణంలోని భాష్యం స్కూలులో మంగళవారం నిర్వహించిన వేడుకల్లో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పద్య, కవులు-బిరుదలపై పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. ఏబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ టీసీ రవిచంద్రకుమార్ ఆధ్వర్యంలో మాతృభాష దినోత్సవం నిర్వహించారు. తెలుగు పండితులు మొవ్వా వృషాద్రిపతి విద్యార్థులకు మాతృభాష గొప్పదనం వివరించారు.

రేపల్లె విద్యార్థినికి వృక్షశాస్త్రంలో బంగారు పతకం



బంగారు పతకాన్ని స్వీకరిస్తున్న విద్యార్థిని మదీహా సురూర్

రేపల్లె: ఆచార్య నాగార్జున యూనివర్శిటీలో మంగళవారం నిర్వహించిన 40వ స్నాతకోత్సవంలో రేపల్లె పట్టణానికి చెందిన మదీహా సురూర్ వృక్ష శాస్త్ర విభాగంలో యూనివర్శిటీ వైస్ చాన్సలర్ పి.రాజశేఖర్ చేతుల మీదగా బంగారు పతకాన్ని అందుకుంది. యూనివర్శిటీ పరిధిలోని కళాశాలలో బీఎస్సీ డిగ్రి మూడు సంవత్సరాలలో అన్ని సబ్జెక్స్ పరీక్షలలో తొలి ప్రయత్నంలోనే ఉత్తీర్ణులై, వృక్షశాస్త్రంలో అత్యధిక మార్కులు సాధించిన వారికి ఈ బంగారు పతకం బహూకరిస్తారు. మదీహా సూరూర్ పట్టణంలోని ఎస్ఎన్‌బీఎటీ కళాశాలలో డిగ్రి చదవి వృక్షశాస్త్రంలో అత్యధిక మార్కులు సాధించింది. ఈసందర్భంగా ఎస్ఎన్‌బీటీ కళాశాల ప్రిన్సిపల్ హుస్నే జహాన్, కరస్పాండెంట్ ఖాదర్‌షరీఫ్, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

క్రీడా స్ఫూర్తితో ముందుకు పోవాలి



విద్యార్థులతో ప్రదర్శనలో పాల్గొన్న అసోసియేట్ డీన్ డీటీ స్మిత్

బాపట్ల: క్రీడా స్ఫూర్తితో విద్యార్థులు ముందుకు పోవాలని వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టరు డీటీ స్మిత్ పేర్కొన్నారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని కళాశాలలో మంగళవారం నిర్వహించారు. హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది ర్యాలీగా పాత బస్టాండ్ నుంచి కాలేజి వరకు ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు. స్మిత్ మాట్లాడుతూ క్రీడలతో ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు వీరప్రసాద్, డాక్టర్ కె.కృపావతి, డాక్టర్ ఆర్.గణేష్‌బాబు, డాక్టర్ లావణ్య, కె.వెంకటేశ్వర్లు, పీడీ రాకేష్ బాలరాజు, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.